# ఫేస్ రీడింగ్

కిటికీ పక్క సీటంటే నాకెంతో ఇష్టం. ప్రయాణం చేసేవారెవరికైనా కిటికీ పక్క సీటు దొరకాలనే భావన కచ్చితంగా ఉంటుందని నా నమ్మకం.

శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పేరుకు తగ్గట్లుగానే వేగంగా పరుగెడుతున్నది.

కిటికీ నుండి వేగంగా వెనక్కి వెళ్తున్న దృశ్యాలను చూస్తూ ఏదో తెలీని పారవశ్యంలో మునిగిపోతున్నాను.

కడుపులో ఒక్కసారిగా తిప్పినట్లయింది. వాంతి వచ్చే సూచనలు కనబడ్డాయి. ఈ ముందస్తు హెచ్చరికలు దేనికి సంబంధించినవో తేలిగ్గానే అర్థమైపోయింది.

సిగరెట్ పొగ, బీడీ పొగ, చుట్టపొగ, గత ఇరవై ఏళ్లుగా వాటి బాధ పడుతూనే ఉన్నా కూడా నా మనసు, శరీరం దానికి ఇంకా అలవాటు పడనందుకు నా మీద నాకే కోపం వచ్చింది.

మళ్లీ కడుపులో దేవినట్లనిపించింది. దీనిక్కారణమైన 'పొగ' ఎక్కడ నుండి వస్తోందా అని అటు ఇటు చూశాను.

కొద్ది దూరంలో, టాయిలెట్ రూం వద్ద ఒకతను నిల్చొని ఇంత మంచి అవకాశం నాకీ జన్మలో 'దొరకదు' అన్నట్లు గుప్పుగుప్పుమంటూ సిగరెట్ తాగుతున్నాడు.

నాకెదురుగా పొగతాగే వాళ్లెవరు కనిపించినా విపరీతమైన కోపం వచ్చేది. వారి వద్దకెళ్లి పొగతాగడం ఆపమనో, లేదా దూరంగా వెళ్లి తాగమనో చెప్పేవాడిని.

నిక్కచ్చిగా చెప్పడం మూలానా ఎన్నోసార్లు గొడవలు కూడా పడ్డాను. కొట్టుకునేంత వరకు వచ్చిన సందర్భాలు ఒకటీ, అరా ఉన్నాయి.

మనసు విరిగింది. 'ప్రపంచంలో ఎవరినైనా మార్చవచ్చు, కానీ పొగతాగే వాళ్లని మార్చలేము' అనే నిర్ణయానికొచ్చేశాను.

నిర్లిప్తత ఏర్పడింది.

తర్వాత పొగ మేఘాలు కనబడితే రుమాలు ముక్కుకి అడ్డం పెట్టుకోవడం ఇంకా ఇబ్బందనిపిస్తే ఆ చోటు నుండి లేచి వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నాను.

సిగరెట్ కంపు రానురాను భరించరానిదిగా మారిపోతోంది. సీటు నుండి లేవబుద్ధి కావడం లేదు.

నా పక్కన కూర్చున్న వాళ్లందరూ అవస్థ పడుతున్నట్లు వాళ్ల ముఖాలు చూస్తే తేలిగ్గా తెలిసిపోతూనే ఉంది.

ఫేస్ రీడింగ్‌లో నేను ఎక్స్‌పర్ట్‌ని.

ఎవరి ముఖాన్నయినా చూసి, ఆ ముఖకవళికలను బట్టి వారి మనసులోని ఆలోచనల్ని ఇట్టే పసిగట్టగలను.

ఈ విషయంలో నేనెప్పుడూ అంచనా తప్పలేదు.

పొగతాగే వ్యక్తిని నిశితంగా పరిశీలించాను. వేషధారణ ఓ మోస్తరుగా ఉంది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. గడ్డం బాగానే పెరిగి ఉంది.

'విలన్ రామిరెడ్డిని గుర్తుకు తెస్తున్నది ఇతని రూపం' మనసులో అనుకున్నాను.

అతని కళ్లు చూస్తుంటే 'ఎవరితో గొడవ పెట్టుకుందామా' అన్నట్లుగా ఉన్నాయి.

ఎవరైనా 'పొగ తాగడం ఆపేయి' అంటే మాత్రం అన్న వ్యక్తిని తన్నడం మాత్రం ఖాయం.



అందుకే నాతోపాటు మిగతా కొందరు ఏమీ చేయలేక అతన్ని మిర్రిమిర్రి చూస్తూ అసహనాన్ని వెలిబుచ్చుతున్నారు.

ఆడవాళ్లు తమ కొంగుల్ని అడ్డం పెట్టుకున్నారు. అతన్ని వీళ్లందరూ 'శాపనార్థాలు' పెడుతున్నట్లు అనిపించింది.

ఉండబట్టడం నా వల్ల కావడం లేదు. ''నీకేమైనా సెన్సుందా? చూస్తే చదువుకున్న వానిలా ఉన్నావు! నీ స్మోకింగ్ వల్ల ఈ కంపార్ట్‌మెంట్‌లో ఎంత మంది అసౌకర్యంగా ఫీలవుతున్నారో ఒక్కసారి చూడు! నీకే అర్థమవుతుంది'' లోలోపలే గొణిగాను. బైటికి అనే ధైర్యం లేక! పొద్దున్నే చదివిన ఒక వార్త తటాలున గుర్తుకు వచ్చింది.

''ఇద్దరి మధ్య జరుగుతున్న వాదనలో ఒక వ్యక్తి అమాయకంగా తలదూర్చి కత్తిపోట్లకి గురై మరణించాడు.''

'నాకెందుకొచ్చిన గొడవ' అని మౌనంగా కూర్చున్నాను. అటువైపు కూర్చున్న వ్యక్తి అసహనంగా కదులుతుండడం గమనించాను. నాలోని 'ఫేస్ రీడర్' ఒక్క ఉదుటున నిద్రలేచాడు.

అతన్నే పరిశీలించడం ప్రారంభించాను. అతని వాలకం చూస్తుంటే సిగరెట్ తాగే వ్యక్తిని ఏదో రకంగా పొగతాగడం ఆపించేస్తాడని దృఢంగా అనిపించసాగింది.

స్టూడెంట్‌లా ఉన్నాడు. రెగ్యులర్‌గా వ్యాయామం చేస్తాడు. ఎందుకంటే అతని శరీరం చూస్తూంటే తెలుస్తూనే ఉంది. 'సిల్వెస్టర్ స్టాలోన్'లా ఉందని!

యథాలాపంగా నా దృష్టి అతని చేతివేళ్లపై పడింది. వేళ్ల కణుపులు కధుములు కట్టి ఉన్నాయి.

'మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యత ఉన్నవాడే! సందేహం లేదు'

బిగుసుకుంటున్న అతని దవడ కండరాలు చూస్తుంటే 'బాడీ బిల్డర్ వల్ల ఆ పొగరాయుని పని ఖతం.'

జరగబోయే దృశ్యాన్ని ఊహిస్తూ ఆనందిస్తున్నాను.

బాడీబిల్డర్ నెమ్మదిగా లేచాడు. తన రెండు చేతుల్ని ప్యాంట్ జేబుల్లో పెట్టుకొని ఒక్కో అడుగు నెమ్మదిగా 'ధూమకేతు' వైపు వేశాడు.

జరగబోతున్న దృశ్యం నా మనోఫలకంపై స్పష్టంగా కనిపించడం మొదలైంది.

నాతోపాటు అందరూ ఊపిరి బిగించి చూడసాగారు.

బాడీబిల్డర్ పొగరాయునితో ఏదో మాట్లాడాడు.

పొగరాయుడు తలూపుతూ తన జేబు నుండి ఏదో తీసి ఇచ్చాడు.

అదేంటో నాకు కనిపించలేదు. ఎందుకంటే బాడీబిల్డర్ అడ్డం ఉన్నాడు గనుక.

కొద్దిసేపటికి బాడీబిల్డర్ మా వైపు తిరిగాడు.

అతని నోట్లో సిగరెట్ వెలుగుతోంది. అగ్గిపెట్టెను తిరిగి ఇచ్చేస్తూ ''థాంక్స్'' అంటూండడం స్పష్టంగా వినిపించింది.

నా మొహం పాలిపోవడం నాకు తెలుస్తూనే ఉంది.

**-వి.ఎస్.పాణి** (మహబూబాబాద్)